జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## ఖమ్మం
శనివారం | 18 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 5



## మొక్కజొన్న కొనగోలు కేంద్రాన్ని ప్రారంభించిన వైరా ఎమ్మెల్యే



**కారేపల్లి,ఏప్రిల్ 17, ప్రజా జ్యోతి :** సింగరేణి మండల పరిధిలోని మాధారం గ్రామంలో కారేపల్లి విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్క జొన్నకొనుగోలు కేంద్రాన్ని శుక్ర వారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రారంభిం చారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..మొదటి సారిగా ప్రభుత్వం మొక్కజొన్న కొనగోలు కేంద్రాలను నెలకొల్పడం అందరూ హర్షించదగ్గ విషయమన్నారు.రై తులు పండించిన పంటకు సరైన ధరలు అందించేలా తెలంగాణా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలి పారు.మధ్యవర్తుల బాధలు లేకుండా రైతులకు నేరుగా లాభం చేకూరే విధంగా ఈ కేంద్రం

మిగతా 2 లో...




# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- రాహ-వీర్ పథకం క్రింద గోల్డెన్ అవర్ లో సహాయం చెస్తే 25 వేలు బహుమతి
- ఖమ్మం జిల్లాలో 30 బ్లాక్ స్పాట్లను సరిదిద్దడంతో ప్రమాదాలు తగ్గుదల
- రాంగ్ సైడ్ డ్రైవింగ్ పై ఏఐ ద్వారా కఠిన చర్యలు
- హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరి
- నిర్లక్ష్యం ప్రాణాంతకం
- ఆర్టీవో కార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా రవాణాధికారి కార్యాలయంలో నిర్వహిం చిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ పును కొల్లు నీరజ, లా అండ్ ఆర్డర్ అదనపు డిసిపి ప్రసాదరావు లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిం చారు.అంతకు ముందు ఆర్టీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.రాహ–వీర్,పిఎం రాహత్ అనే రెండు కొత్త పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రమాద బాధితులను గోల్డెన్ అవర్ లో ఆసుపత్రికి తర లించిన వారికి రాహ–వీర్ పథకం క్రింద 25 వేలు ప్రోత్సాహకంగా అందజేస్తామని తెలిపారు. పీఎం రాహత్ పథకం క్రింద ప్రమాద బాధితులకు లక్షన్నర వరకు నగదు రహిత చికిత్సను పూర్తిగా ఉచితంగా అందిస్తామని వివ రించారు.ఈ పథకాలు గోల్డెన్ అవర్ ను సమర్థవం తంగా వినియోగించేందుకు తీసుకొచ్చినవని తెలిపారు. సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించడం మన రక్షణ కోసమేనని, వాటిని తప్పించుకోవాలని ప్రయత్నించడం సరికాదని సూచించారు. కారులో ప్రయాణించే సమయంలో డ్రైవర్ మాత్రమే కాకుండా ప్రయాణికులు కూడా తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు.ఖమ్మం జిల్లాలో టాప్ 30 యాక్సిడెంట్ బ్లాక్ స్పాట్లను గుర్తించి సరిదిద్దినట్లు తెలి పారు. దీని వల్ల ప్రమాదాలు

మిగతా 2 లో...

## వైరా నియోజకవర్గంపై మాట్లాడే నైతిక హక్కు పువ్వాడ అజయ్ కు లేదు.



- పొలిటికల్ పొత్తులతో మెడికల్ కాలేజీలు తెచ్చుకున్నారు.
- అధికారం పోయిందని అజయ్ అసహనంతో మాట్లాడుతున్నారు.
- కేసీఆర్ ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు.
- రెండేళ్లలో వైరా నియోజకవర్గంలో రూ .1000 కోట్ల అభివృద్ధి జరిగింది.
- వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్.

**కారేపల్లి, ఏప్రిల్ 17 ప్రజా జ్యోతి:** వైరా నియోజకవర్గ అభివృద్ధిపై మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కు మాట్లాడే నైతికహక్కు ఏమాత్రం లేదని వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అన్నారు. సింగ రేణి మండలంలో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమములో పాల్గొన్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రామదాసు నాయక్ విశ్వనాథపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో

మిగతా 2 లో...

## ప్రమాదాల నుండి బాధితులను కాపాడితే రూ. 25 వేలు ఆర్థిక సహాయం

- ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు




2 లో...

## విద్యార్థులకు షైన్ హై స్కూల్ యాజమాన్యం వేధింపులు




- ఫీజు చెల్లించలేదని పరీక్షలు రాయనీయకుండా ఎండలో నిలబెట్టిన యాజమాన్యం
- మూడు గంటల పాటు విద్యార్థులు ఎండలోనే
- బాధిత మహిళా ఉపాధ్యాయుల పిల్లలే వారి టార్గెట్
- షైన్ హై స్కూల్ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని
- అదనపు కలెక్టర్, డీఈఓ లకు విద్యార్థుల

### తల్లిదండ్రులు ఫిర్యాదు

**బోనకల్, ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి)** :షైన్ హై స్కూల్ పై చర్యలు తీసుకోవా లని బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాల యంలో జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైని, జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ పి శ్రీజ లకు ఫిర్యాదు చేశారు. విద్యాబుద్ధులు నేర్పి విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేరుకునేలా తీర్చి దిద్దవలసిన సరస్వతీ నిలయంలో ఫీజులు చెల్లించలేదని ఓ ప్రైవేటు పాఠ శాల యాజమాన్యం విద్యార్థులను తెలుగు పరీక్ష రాయినియకుండా మూడు గంటల పాటు మండుటెం డలో నిలబెట్టిన సంఘటన బుధ వారం మండల కేంద్రమైన బోనకల్ లో చోటుచేసుకుంది. బాధిత విద్యా ర్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. బోనకల్ మండల కేంద్రం లోని షైన్ హై స్కూల్ లో చదువుతున్న విద్యార్థులకు హాల్ టికెట్స్ ఇవ్వ కుండా గత వారం రోజులుగా ఫీజులు కట్టలేదని

మిగతా 2 లో...

## ప్రమాదాల నుండి బాధితులను కాపాడితే రూ. 25 వేలు ఆర్థిక సహాయం

- ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** రోడ్డు ప్రమాదం సమయంలో గోల్డెన్ అవర్ లో బాధితులను ఆస్పత్రికి తరలిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు అన్నారు.అరైవ్ అలైవ్ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఖమ్మం టూ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో సాధారణ ప్రజలు, విద్యార్థులతో కలిసి గోల్డెన్ అవర్ రెస్పాన్స్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించి,సీపీఆర్,ప్రథమ చికిత్స, అత్యవసర కాల్స్, పీఎం రహత్ నగదు ప్రోత్సాహం,సామాజిక బాధ్యత,గోల్డెన్ అవర్ రెస్పాన్స్ టైమ్ మొదలైన వాటి గురించి వివరించారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..ప్రమాదం నుండి బాధితులను కాపాడినవారికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. నగదు సాయంతో పాటు ప్రశంసాపత్రం కూడా అందిస్తారు.రోడ్డు ప్రమాదంలో బాధితులను కాపాడేలా ప్రజలను ప్రోత్సహించేందుకు ఈ పథకాన్ని కేంద్రం అమలు చేస్తోందని తెలిపారు.

## విద్యార్థులకు షైన్ హై స్కూల్ యాజమాన్యం వేధింపులు

(మొదటి పేజీ తరువాయి...)

యాజమాన్యం విద్యార్థులను వేధింపులకు గురి చేస్తూ బుధవారం ఫైనల్ పరీక్షలు రాయనియకుండా తరగతి గదిలో నుండి బయటకు పంపించి మండు టెండలో విద్యార్థులను మూడు గంటలు నిలబెట్టడంపై పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ తీరును విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు, విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఇదే పాఠశాలలో పనిచేసిన బాధిత మహిళ ఉపాధ్యాయులు కరస్పాండెంట్, ప్రిన్సిపల్ వేధింపులకు తట్టుకోలేక జీతాలు చెల్లించటం లేదని మండల విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేయడంతో పాటు వివిధ పత్రికల్లో వార్త కథనాలు రావడంతో అప్పటినుండి కోపోద్రిక్తులైన షైన్ స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ బాధిత మహిళా ఉపాధ్యాయుల పిల్లల్ని ఫీజుల పేరుతో టార్గెట్ చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పరీక్షలు రాయనియకుండా విద్యార్థులను బయటికి పంపించిన విషయం విద్యార్థుల తల్లిదండ్రులు మండల విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్లగా కనీసం మండల విద్యాశాఖ అధికారి ఫోను కు కూడా షైన్ హై స్కూల్ కరస్పాండెంట్ స్పందించలేదని తెలిసింది. తమ స్కూల్లో తాము ఇష్టానుసారం వ్యవహరిస్తామని విద్యాశాఖ అధికారులకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదనే విధంగా ఆ పాఠశాల యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు వివాహస్పదంగా మారింది. విద్యార్థుల విద్యా హక్కుకు భంగం కలిగించే విధంగా విద్యార్థులను పరీక్షలు రాయనీయకుండా వ్యవహరించిన షైన్ హై స్కూల్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ డా శ్రీజ, జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైనీ, లకు ఫిర్యాదు చేశారు. సమగ్ర విచారణ జరిపి బాధిత విద్యార్థులకు న్యాయం చేస్తామని అదనపు కలెక్టర్, డీఈవో బాధితులకు హామీ ఇచ్చారు.

## మొక్కజొన్న కొనగోలు కేంద్రాన్ని ప్రారంభించిన వైరా ఎమ్మెల్యే

(మొదటి పేజీ తరువాయి...)

పని చేస్తుందని పేర్కొన్నారు.మొక్కజొన్న పంట క్వింటాల్ కు మద్దతు ధర రూ.2400లు ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు.ఈ కొనుగోలు కేంద్రం ద్వారా మాధారంతో పాటు పరిసర ప్రాంతాల రైతులు ఇక్కడ మొక్కజొన్నలు అమ్ముకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోతు రామ్మూర్తి నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు పగడాల మంజుల,తాసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు,వ్యవసాయ శాఖ అధికారి బట్టు అశోక్ కుమార్, ఐకేపీ ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు,సీఐ నూనావత్ సాగర్,ఎస్సై బైరు గోపి,విద్యుత్ ఏఈ వెంకన్న, సొసైటీ మాజీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు,మాదారం,కొత్త తండా సర్పంచ్ లు అజ్మీరా ఉమానరేష్ ,ధారావత్ మంగీలాల్ తో పాటు వివిధ గ్రామ పంచాయతీల సర్పంచ్ లు,మండల,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

(మొదటి పేజీ తరువాయి...)

తగ్గి ఈ ఏడాది 15 మంది ప్రాణనష్టం తగ్గిందని అన్నారు. మరిన్ని బ్లాక్ స్పాట్లను గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.రాంగ్ సైడ్ డ్రైవింగ్ ను గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని వినియోగించి వాహనాలను గుర్తించి భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.పునరావృతంగా నిబంధనలు ఉల్లంఘించే వారి లైసెన్సులు రద్దు చేసి వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.ఖమ్మం జిల్లా రోడ్డు భద్రతలో అగ్రగామిగా నిలవాలని, ప్రమాదాలు జరగకుండా అందరూ కృషి చేయాలని సూచించారు.నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నదని తెలిపారు.రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ప్రయాణికుల భద్రత అత్యంత ముఖ్యమని అన్నారు.హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం వల్ల ఎన్నో ప్రాణాలు కోల్పోతున్న సందర్భాలను



చూస్తున్నప్పటికీ ఇంకా నిర్లక్ష్యం చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి తమను తాము రక్షించుకోవాలని, ఒకరి ప్రాణ నష్టం కుటుంబానికి, తమకు ఎంతో పెద్ద నష్టాన్ని కలిగిస్తుందని తెలిపారు.లా అండ్ ఆర్డర్ అదనపు డిసిపి ప్రసాదరావు మాట్లాడుతూ అరైవ్ అలైవ్ అంటే ఇంటి నుంచి బయటకు వెళ్లిన ప్రతి ఒక్కరూ సురక్షితంగా తిరిగి ఇంటికి చేరుకోవడం అని భావించాలన్నారు. వాహనదారులు అందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు యూనిఫారం ధరించడం తప్పనిసరి అని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రయాణికులు కూడా హెల్మెట్ ధరించాల్సిందేనని స్పష్టం చేశారు. అలాగే కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. అవగాహన కార్యక్రమం అనంతరం కఠినంగా నిబంధనలు అమలు చేస్తామని హెచ్చరించారు.అంతకుముందు కార్యాలయ ఆవరణలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్, డాక్టర్లచే డ్రైవర్లకు నిర్వహిస్తున్న కంటి పరీక్షలను పరిశీలించారు. డ్రైవర్లు ఆరోగ్యంగా ఉండటం రోడ్డు ప్రమాదాల నివారణలో కీలకమని అన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన ఆడియో విజువల్ (ఏవీ) ప్రదర్శనను వీక్షించారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా పాటించాలని సూచించారు.అనంతరం జిల్లా కలెక్టర్, మేయర్ లు కేఎంసి డిఆర్ఎఫ్ టీమ్ సిబ్బందికి హెల్మెట్లు ప్రధానం, రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు,ఆర్టీసీ ఖమ్మం రీజియన్ లో ఉత్తమ డ్రైవర్ లకు ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ఆర్టీఓ జె.ఎన్. శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్, ఏఎంవిఐలు జి.దినేష్,జి.సుమలత,ఆర్టీఏ మెంబర్ జి. వెంకన్న, కౌన్సిలర్లు, వాహనదారులు,ప్రజలు,సాంస్కృతిక సారథి కళాకారులు,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# వైరా నియోజకవర్గంపై మాట్లాడే నైతిక హక్కు పువ్వాడ అజయ్ కు లేదు

(మొదటి పేజీ తరువాయి...)


మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పై విమర్శలతో విరుచుకుపడ్డారు. రాజకీయ పొత్తులతో మెడికల్ కాలేజీలు,గత ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని అనేక రకాలుగా లబ్ధి పొందిన మీరు కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడే నైతిక హక్కు ఏమాత్రం లేదని విమర్శించారు. గతంలో మంత్రిగా ఉన్న మీరు వైరా నియోజకవర్గానికి ఒక్క పని కూడా చేయలేదని దుయ్యబట్టారు. అధికారం కోల్పోయిన అసహనంతో అడ్డగోలుగా మాట్లాడటం సరి కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన నాటి నుంచి నేటివరకు వైరా నియోజకవర్గంలో వెయ్యి కోట్ల రూపాయల కు పైబడి వివిధ అభివృద్ధి పనులు చేపట్టానని తెలిపారు. 200 కోట్ల రూపాయలతో వైరా కు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను మంజూరి చేయించానని పనులు కూడా ముమ్మరంగా జరుగుతున్నాయనీ పేర్కొన్నారు. గోదావరి నీళ్లను సాగర్ కు మళ్లించి 42 కోట్లతో రైతులకు సాగు నీరు అందించాం అని చెప్పారు. వంద పడకల ఆసుపత్రి, అటవీ హక్కు పత్రాలు పొందిన ఫారెస్ట్ భూముల్లో ఐదు వందల బోర్లు వేయించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. వైరా మున్సిపాలిటీకి పది వేల ఇందిరమ్మ చీరల పంపిణీ జరిగిందని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా సీ సీ, బీటీ రోడ్లు మొత్తం 1372 పనులు 108 కోట్లతో పూర్తి చేయించడం జరిగిందనీ వివరించారు. 912 స్వయం సహాయక సంఘాలకు 118 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేయించినట్లు తెలిపారు. వైరా నియోజకవర్గంలో 4250 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించానని, అర్హులైన పేదలందరికీ దశల వారీగా మంజూరు చేయడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. వైరా మున్సిపాలిటీ కి 15 కోట్ల రూపాయల ప్రత్యేక నిధులను మంజూరు చేయించి వైరా పట్టణ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించానని పేర్కొన్నారు. వైరా నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధిలో దూసుకుపోతుంటే ఏమీ చేయలేదని మాజీ మంత్రి అజయ్ కుమార్ మాట్లాడటం సరికాదన్నారు. మీ రాజకీయ అనుభవంతో అవసరమైతే నియోజకవర్గ అభివృద్ధి కోసం మంచి సలహాలు సూచనలు ఇస్తే తీసుకుంటాం కానీ అనవసరపు ఆరోపణలతో మాట్లాడటం ఏమాత్రం తగదని అన్నారు. పదేళ్ల కాలంలో ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ఎనిమిది లక్షల కోట్లు అప్పులు చేసి ఫామ్ హౌస్ లో పడుకున్న కేసీఆర్ గురించి గొప్పలు చెప్పుకోవడం తెలంగాణ సమాజం సహించదని హెచ్చరించారు.



### ప్రజాసేవకే అంకితం అయ్యా....

నాకు గాని నా కుమారుడికి గాని ఎటువంటి కాంట్రాక్టులు, వ్యాపారాలు లేవని నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజాసేవకే అంకితం అయ్యామని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశం భగవంతుడు కల్పించాడని అదే మార్గంలో పయనిస్తూ ప్రజల కోసమే పనిచేస్తున్నా అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అద్భుతమైన పథకాలను ప్రజల దరి చేర్చడం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నామని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయలేని పనులు కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో చేసి చూపిస్తున్నధని పేర్కొన్నారు. వైరా నియోజకవర్గ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని సీతారామ ప్రాజెక్టు ద్వారా కారేపల్లి మండలానికి కూడా సాగు నీరు వచ్చేలా కృషి చేస్తానని చెప్పారు. ఈ సమావేశం కాంగ్రెస్ నాయకులు రామారావు, పతే మహమ్మద్, పగడాల మంజుల, బానోతు రామ్మూర్తి, దుగ్గినేని శ్రీనివాసరావు, విష్ణువర్ధన్ రెడ్డి, అడ్డగోడ ఐలయ్య, మేదరి టోనీ, పెద్దబోయిన ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి త్రవ్వకాల నిబంధనల సడలింపు కోసం సబ్ కలెక్టర్‌కు బీఆర్ఎస్ సర్పంచ్‌ల వినతి



**కల్లూరు, ఏప్రిల్ 17: ప్రజా జ్యోతి** అక్రమ మట్టి త్రవ్వకాలపై ఉక్కుపాదం మోపుతున్న చర్యలను స్వాగతిస్తూనే, రైతుల అవసరాల దృష్ట్యా నిబంధనలను కొంత సడలించాలని కోరుతూ కల్లూరు మండల బీఆర్ఎస్ సర్పంచ్‌లు గురువారం సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఐఏఎస్ అధికారి అజయ్ యాదవ్‌ను కలిసిన సర్పంచ్‌ల బృందం పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లింది. ఇటీవల అక్రమ మట్టి త్రవ్వకాలపై సబ్ కలెక్టర్ తీసుకుంటున్న కఠిన చర్యలు అభినందనీయమని వారు పేర్కొన్నారు. సర్పంచ్‌ల ప్రధాన విజ్ఞప్తులు రైతుల ఇబ్బందులు పొలాల్లో ఎత్తుపల్లాలు సవరించుకోవడానికి, సొంత పొలంలోని మట్టిని గృహ అవసరాలకు వాడుకోవడానికి కూడా ప్రస్తుత నిబంధనల వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారు.అభివృద్ధి పనులకు ఆటంకం ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్ల నిర్మాణానికి మట్టి అవసరమైనప్పటికీ కఠిన నిబంధనల వల్ల పనులు నిలిచిపోతున్నాయి.హామీ నిబంధనలు సడలించిన తర్వాత ఎవరైనా ఉల్లంఘనలకు పాల్పడితే వారి అనుమతులు రద్దు చేయవచ్చని సర్పంచ్‌లు స్పష్టం చేశారు. వినతిపత్రం స్వీకరించిన సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సానుకూలంగా స్పందించారు. రైతులు, ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకొని రెండు మూడు రోజుల్లో తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సర్పంచ్‌ల బృందం సబ్ కలెక్టర్‌ను శాలువాతో సత్కరించింది. ఈ కార్యక్రమంలో లింగాల సర్పంచ్ వేము కృష్ణ, ఎర్రబోయినపల్లి సర్పంచ్ పొట్రు శ్రీనివాసరావు చెన్నూరు సర్పంచ్ జినుగు శ్రీనివాసరావు, పాయపూర్ సర్పంచ్ కోలేటి శ్రీనివాసరావు ఎర్ర బంజర సర్పంచ్ గుగులోతు శ్రీనివాసరావు ఎర్ర బోయినపల్లి మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణ రంగ కార్మికుల కూలీ రేట్లు పెంపు

- మేడే నుండి అమల్లోకి అన్ని పక్షాల అంగీకారంతో వివాదం పరిష్కారం
- మేడే నుండి కొత్త రేట్లు అమలు

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లాలో నిర్మాణ రంగంలో పనిచేస్తున్న సుతారి, మేస్త్రీలు సహా సహాయ కార్మికుల కూలీ రేట్ల పెంపు విషయమై గత 13.04.2026న కార్మిక శాఖ కార్యాలయంలో సంయుక్త సమావేశం జరిగింది. ఉప కార్మిక కమిషనర్ కె. విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై గురువారం అందరూ సంతకాలు చేశారు.నేపథ్యం ఏమిటంటే గత కొద్దిరోజులుగా ఒక ఇండిపెండెంట్ సుతారీకూలీల యూనియన్ కూలీ రేట్లు పెంచాలని కరపత్రాలు పంచి, అపార్ట్ మెంట్లు మరియు వ్యక్తిగత నిర్మాణ స్థలాల్లో జోక్యం చేసుకుని పనులకు అంతరాయం కలిగించింది. దీంతో క్రెడాయి చాప్టర్ ఖమ్మం జిల్లా కలెక్టర్ గారికి మరియు కార్మిక శాఖకు ఫిర్యాదు చేయడంతో ఈ సమావేశం ఏర్పాటు చేయబడింది.సమావేశంలో పాల్గొన్న సిఐటియు, ఏఐటీయూసి , ఇండిపెండెంట్, ఐ ఎన్ టి యు సి , ఐఎఫ్టియు , టి యు సి (I) తదితర 7 యూనియన్ల ప్రతినిధులు, కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తున్న ఇండిపెండెంట్ సుతారీకూలీల యూనియన్ ప్రతినిధులు, క్రెడాయి చాప్టర్ ఖమ్మం, ఖమ్మం బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.సమాన పనికి సమాన వేతనం.సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ముఖ్యమైన అంశాన్ని స్పష్టం చేశారు. ఆడకూలీకి, మగకూలీకి వేతనంలో వ్యత్యాసం ఉంచడం రాజ్యాంగ విరుద్ధం. సమాన పనికి సమాన వేతనం అనేది రాజ్యాంగం మరియు చట్టం కల్పించిన హక్కు. కాబట్టి ఇకపై ఆడ మగ తేడా లేకుండా ఒకే వేతనం వర్తిస్తుందని స్పష్టం చేశారు. దీనికి అందరూ అంగీకారం తెలిపారు.చర్చలు వివిధ డిమాండ్లు.ఇండిపెండెంట్ సుతారీకూలీల యూనియన్ వారు మేస్త్రీ కూలీని రూ 950 నుండి ₹1,400కు, మగకూలీని రూ 670 నుండి రూ 950కు, ఆడకూలీని రూ 650 నుండి రూ 900కు పెంచాలని డిమాండ్ చేశారు.వివిధ గుర్తింపు పొందిన యూనియన్లు మేస్త్రీ కూలీని రూ 950 నుండి రూ 1,150కు, సహాయ కార్మికుల కూలీని రూ 670 నుండి ₹800కు పెంచాలని అభిప్రాయపడ్డారు.తుది నిర్ణయం సుదీర్ఘ చర్చల అనంతరం బిల్డర్స్ ప్రతినిధులు, యూనియన్ ప్రతినిధులు అందరూ ముక్తకంఠంతో తుది నిర్ణయాన్ని డిప్యూటీ కమిషనర్ కు అప్పగించారు. దీంతో ప్రస్తుత ధరలకు అనుగుణంగా 10 శాతం పెంపు నిర్ణయించారు.వర్గం గత రేటుకొత్త రేటుమేస్త్రీ,సుతారి ₹950 ₹1,050 సహాయ కార్మికులు (ఆడ, మగ) ₹670 ₹735 ఈ సవరించిన రేట్లు మే మేడే నుండి అమల్లోకి వస్తాయని, 31 మార్చి 2028 వరకు అమల్లో ఉంటాయని నిర్ణయించారు.అదనపు నిర్ణ యాలు ప్రతి కార్మికుడు కూలీకి తగ్గట్లుగా రోజుకు 8 గంటలు పని చేయాలని, ప్రతి కార్మికుడు కార్మిక శాఖ జారీ చేసిన బి ఓ సి డబ్ల్యు గుర్తింపు కార్డు కలిగి ఉండాలని, లేని వారికి వెంటనే నమోదు చేయించేలా యాజమాన్యాలు సహాయపడాలని కోరారు.తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తు చేశారు.సమస్య పరిష్కారమైంది.సమావేశంలో తీసుకున్న నిర్ణయాలన్నీ మినిట్స్ లో రికార్డు చేయబడ్డాయి. 13.04.2026న జరిగిన సమావేశానికి హాజరైన అన్ని యూనియన్ల ప్రతినిధులు,క్రెడాయి చాప్టర్ ఖమ్మం, ఖమ్మం బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం మినిట్స్ పై సంతకాలు చేశారు.నిర్మాణ రంగ కార్మికుల కూలీ రేట్ల వివాదం సత్వరంగా, సఫలంగా పరిష్కారమైంది. ప్రతి సమస్యనూ చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చని ఈ సమావేశం మరోసారి నిరూపించింది.కె. విజయభాస్కర్ రెడ్డి, ఉప కార్మిక కమిషనర్, ఖమ్మం ఈ వివాదం సత్వర పరిష్కారానికి నిరంతరం సహకరించిన అన్ని కార్మిక సంఘాల నాయకులకు,క్రెడాయి చాప్టర్ ఖమ్మం ప్రతినిధులకు, ఖమ్మం బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులందరికీ కార్మిక శాఖ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తోంది.

## ఎస్ఐకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన కట్కూరి శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం తిరుమలాయపాలెం ఏప్రిల్ 17( ప్రజా జ్యోతి )**తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్ ఎస్సై కూచిపూడి జగదీష్ కి శుక్రవారం మండల కాంగ్రెస్ నాయకులు కట్కూరి శ్రీనివాసరెడ్డి, తవడ బోయిన కృష్ణ, మోరపాక నాగయ్య ఇందుర్తి మధుసూదన్ రెడ్డి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కట్కూరి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన దగ్గర నుండి మండలంలో శాంతిభద్రతలు పరిరక్షణలో ఆయన ఎనలేని కృషి చేశారని, జరిగిన స్థానిక సంస్థల ఎలక్షన్లలో పూర్తి బందోబస్తు ఏర్పాటు చేసి ఎక్కడ ఎలాంటి గొడవలు కాకుండా విజయవంతంగా ఎన్నికలు పూర్తి చేశారని, తెలియజేశారు అదేవిధంగా మండలంలో డ్రగ్స్ నివారణ కోసం కృషి చేయడం, రోడ్డు ప్రమాదాలు తగ్గుటకు భద్రతా చర్యల గూర్చి పలు చైతన్యవంతమైన కార్యక్రమాలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ,మరొకసారి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం దందా సాగిస్తున్న ఆత్మకూరి జగదీష్ పై పీడీ యాక్ట్ అమలు

- పోలీస్ కమిషనర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** రేషన్ బియ్యాన్ని దారి మళ్లించి దుర్వినియోగానికి పాల్పడుతున్న ఆత్మకూరి జగదీష్‌పై పీడీ యాక్ట్ అమలు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు.పేదలకు ఉచితంగా అందాల్సిన బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, బయట రాష్ట్రాలక తరలిస్తుండటంతో ఖ మ్మం జిల్లాలో 13 కేసులు, సూర్యాపేట, వరంగల్ జిల్లాలో రెండు కేసుల్లో ప్రధాన నిందుతుడుగా వున్న ఖమ్మం నగరానికి చెందిన ఆత్మకూరి జగదీష్‌పై శుక్రవారం పీడీ యాక్ట్ అమలు చేసి హైదరాబాద్ చంచలగూడ సెంట్రల్ జైలు తరలించడం జరిగిందన్నారు.దీర్ఘకాలికంగా బియ్యాన్ని బ్లాక్ మార్కెటింగ్ చేస్తూ, తరచూ పట్టుబడటంతో పీడీ యాక్ట్‌ను నమోదు చేసినట్లు తెలిపారు. పేదల కడుపు కొట్టే రేషన్ బియ్యం మాఫియాపై కఠిన చర్యలు తప్పవని అన్నారు.

## కల్లూరులో 'అరైవ్ ఆలైవ్' అవగాహన కార్యక్రమం

- గోల్డెన్ అవర్ రెస్పాన్స్‌పై పోలీసుల శిక్షణ




**కల్లూరు, ఏప్రిల్ 17: ప్రజా జ్యోతి** రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కాపాడేందుకు 'గోల్డెన్ అవర్' ప్రాముఖ్యతను వివరిస్తూ కల్లూరు పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 'అరైవ్ ఆలైవ్' కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఏసీపీ వసుంధర యాదవ్ పర్యవేక్షణలో, ఎస్సై హరిత ఆధ్వర్యంలో కల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగాల గ్రామంలో గురువారం గోల్డెన్ అవర్ రెస్పాన్స్ శిక్షణా కార్యక్రమం జరిగింది. కల్లూరు సీహెచ్సీ వైద్య బృందం సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఆర్, ప్రథమ చికిత్స, అత్యవసర కాల్స్‌కు స్పందించే విధానం, పీఎం రహత్ నగదు ప్రోత్సాహకం, గోల్డెన్ అవర్ రెస్పాన్స్ టైమ్ ప్రాధాన్యతపై గ్రామస్థులకు వివరించారు. ప్రమాదం జరిగిన మొదటి గంటలో సరైన వైద్యం అందిస్తే ప్రాణాలు నిలబెట్టవచ్చని వైద్య సిబ్బంది తెలిపారు. అదేవిధంగా రహదారి భద్రతపై డ్రైవర్లు,వాహనదారులకు పోలీసులు అవగాహన కల్పించారు. హెల్మెట్, సీటుబెల్టు తప్పనిసరిగా ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, సెల్ ఫోన్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండడం, అతివేగాన్ని నియంత్రించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఎస్సై హరిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లింగాల గ్రామ సర్పంచ్ వేణు కృష్ణ, కల్లూరు సీహెచ్సీ వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు, వాహనదారులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కి కృతజ్ఞతలు తెలిపిన మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాతా రామనాదం



**మధిర ప్రజా జ్యోతి** పట్టణ అభివృద్ధి దిశగా మరో ముఖ్యమైన అడుగు పడింది. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మల్లు భట్టి విక్రమార్క కృషితో మధిర రివర్ ఫ్రంట్ అభివృద్ధి మరియు సుందరీకరణ పనుల కోసం 9 కోట్లు మంజూరు చేయడం జరిగింది. వైరా నది కరకట్ట పక్కన ఈ ప్రాజెక్టు అమలు ద్వారా మధిర పట్టణానికి కొత్త అందం రావడంతో పాటు ప్రజలకు విశ్రాంతి, వినోదం కోసం ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతూ, పర్యాటక అభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది.మధిర అభివృద్ధి పట్ల నిరంతరం కృషి చేస్తున్న భట్టి విక్రమార్క గారికి మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాదం కృతజ్ఞతలు తెలియజేసినారు.

## పి ఆర్ సి ప్రకటించి సమస్యలు పరిష్కరించాలి

- టీజీఈజేఏసీ





**వేంసూరు,ఏప్రిల్ 17 ప్రజాజ్యోతి** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీజీఈజేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. దశలవారీ పోరాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రెండో పీఆర్సీ నివేదికను వెంటనే ప్రకటించి 51 శాతం ఫిట్ మెంట్ అమలు చేయాలని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ఉద్యోగులకు హెల్త్ కార్డులు తక్షణమే మంజూరు చేయాలని పేర్కొన్నారు.అనంతరం తమ డిమాండ్లతో తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో:కోలేటి నిర్మలకుమారి,గుత్తా చంద్రశేఖర్, బౌరోజు ఈశ్వరాచారి,రాజశేఖర్ రెడ్డి, సోమేశ్వరరావు,రామకృష్ణ, శ్రీకాంత్, సత్యనారాయణ, పుల్లారావు,కల్పన, సుబ్బారావు,శ్రీనివాసరెడ్డి, చిన్న వెంకటేశ్వరరావు, కృష్ణమోహన్, కిషోరి, జమీలబేగం,మారేశ్వరరావు, దీన్ దయాల్, నాగంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి యువజన కాంగ్రెస్ చలో హైదరాబాద్ కార్యక్రమానికి భారీగా తరలిరండి

- యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేజెండ్ల సాయికుమార్

మధిర ప్రజా జ్యోతి నేడు హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ధర్నా చౌక్ లో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న మహాధర్నా కార్యక్రమానికి జిల్లాలోని యువజన కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా యువజన కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు వేజెండ్ల సాయికుమార్ పిలుపునిచ్చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలో మోడీ నాయకత్వంలోని ఎన్ డి ఏ ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి భారతదేశంలో యువకులు, కార్మికులు, కర్షకులు రోడ్డున పడ్డారని, ఈరోజు ఈ దేశానికి వెన్నుముక అయినటువంటి రైతుల పొట్ట కొట్టి, వారిని రోడ్లపైకి లాగే విధంగా కేం ద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం అమెరికాతో చీకటి ఒప్పందాలు చేసుకొని అమెరికా యొక్క వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాల ఎత్తివేసారని, దీనివలన భారతదేశంలో రైతుల తీవ్రంగా నష్టపోతున్నారని, భారత్ అమెరిక చేసుకున్న ఇండో అమెరికన్ డీల్ ను వ్యతిరేకిస్తూ నేడు ఉదయం 10 గంటలకు హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద ఉన్న ధర్నా చౌక్ లో వేలాది మంది యువజన కాంగ్రెస్ కార్యకర్తలతో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సాయికుమార్ అన్నారు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు.వైస్ ప్రెసిడెంట్ బెజ్జం బాల గంగాధర్ జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ కోఆర్డినేటర్ బెల్లం సాయితేజ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ జంగం రాజేష్ అంబటి ఈశ్వర్ చల్లగుండ్ల సాయితేజ కొణిజర్ల మండ లం అధ్యక్షుడు ముత్తారం జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు పంది రాజు గౌడ్ బెజ్జం నవీన్ సతీష్,రఘురాం,రామకృష్ణ,ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధిని చూసి ఓర్వలేకనే రాజకీయ విమర్శలు చేస్తున్నారు

- డాక్టర్, కాపా చంద్రకళ
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అసత్య ప్రచారాలు మానుకోవాలి



**ఖమ్మం వైరా ఏప్రిల్ 17 ప్రజా జ్యోతి** మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీపై అవాకులు చవాకులు మానుకోవాలని వైరా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ అన్నారు అజయ్ కుమార్ ప్రెస్ మీ ట్ పెట్టి ప్రభుత్వాన్ని విమర్శించడంపై శుక్రవారం వైరా ఎమ్మెల్యే క్యాంపు కా ర్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రెండున్నర సంవత్సరాల కాలంలో ఎంతో అభివృద్ధి చేసిందని అన్ని వర్గాలకు సమాన సంక్షేమ ఫలాలు అందించిందన్నారు వైరా నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు తీస్తుందని అన్నారు. వందల కోట్ల నిధులతో వంద పడకల ఆసుపత్రులు ఇంటిగ్రేటెడ్ స్కూల్ డ్రైనేజీలు రోడ్లు అన్ని రకాల అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. కళ్ళు ఉండి చూడలేని అజయ్ కుమార్ అభివృద్ధి జరగలేదని విమర్శించడం ఆస్యస్పదమన్నారు. వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి వంద కోట్ల నిధులని మంజూరు చేయించిన ఘనత రామదాసు నాయకదని తెలిపారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి దేశంలోనే నెంబర్ వన్ గా నిలిచిందని చెప్పారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ వందేళ్లు వెనక్కి పోయిందని విమర్శించారు. ప్రజలు బిఆర్ఎస్ పాలనకి విసిగిపోయి కాంగ్రెస్కి పట్టం కట్టారని పేర్కొన్నారు. ప్రజా పాలనలో సుభిక్షమైన పాలన జరుగుతుందని అన్నారు. ఇకనైనా వాస్తవాలను గుర్తించి మాట్లాడాలని ప్రేలాపనలు చేయవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ బొల్ల గంగారావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు రాంపుడి రోశయ్య, పమ్మి అశోక్, పట్టణ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు సర్పంచులు సీలం నర్సిరెడ్డి, బాలాజీ, ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్లు రాసబంటి బలరామయ్య, శ్యామ్, వేముల రత్నాకర్ పిచ్చారావు, ఏడుకొండలు మిట్టపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎవరీ చైల్డ్ రీడ్స్ విలువైన ఇంగ్లీష్ మెటీరియల్ను అందించిన డా.పారా ఉష



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కార్యక్రమం ఎవరీ చైల్డ్ రీడ్స్ కు సంబంధించిన పదివేల రూపాయల విలువైన ఇంగ్లీష్ మెటీరియల్ను డాక్టర్ పారా ఉష పాఠశాలకు అందించారు.ఖమ్మం నగరంలోని జిపిఎస్ బికే బజార్ పాఠశాలలో ఐదవ తరగతి విద్యార్థుల ఫేర్వెల్ డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఖమ్మంఅర్బన్ ఎంఈఓ శైలజ లక్ష్మి , శ్రీహవిష హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ పారా ఉష , వారి తండ్రి ప్రముఖ గ్రానైట్ యజమాని పారా నాగేశ్వరరావు హాజరైనారు. ఈ సందర్భంగా వారికి చిరు సత్కారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంబటి రవికుమార్,నాగప్రసన్న ,అంగన్వాడీ టీచర్ నాగమణి , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉచిత డెంటల్ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఉప సర్పంచ్ మాధవి



**చింతకాని ఏప్రిల్ 17ప్రజాజ్యోతి ప్రతినిధి :**చింతకాని మండలం చిన్నమండవ గ్రామంలో ఈరోజు మమత డెంటల్ కాలేజీ ఖమ్మం వారి ఆధ్వర్యంలో ఉచిత డెంటల్ వైద్య శిబిరాన్ని ఉప సర్పంచ్ తంగిరాల మాధవి ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ మమత డెంటల్ హాస్పిటల్ వారు మా గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అనేది సంతోషకరమని అన్నారు మమత డాక్టర్స్ టీమ్ లీడర్ డాక్టర్ దర్శిక గారికి వైద్య సేవలను గ్రామంలో అందించినందుకు ఉప సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రామకృష్ణ,వార్డ్ మెంబర్స్ పర్చగని వెంకటరాములు, గుండ్ల బేబీ రాణి, గుండ్ల భద్రమ్మ , తుపాకుల లక్ష్మీనారాయణ , గంటేల స్వామి దాసు పర్చగని ఏడుకొండలు పర్చగని వేణు , పాస్టర్ దానియేలు రాచకొండ వీరయ్య మరియు అనేకమంది గ్రామస్తులు వైద్య సేవలును పొందారు.

## తిర్లాపురం గ్రామంలో ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి

- ముఖ్య అతిథులుగా చింతకాని విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు



**చింతకాని ఏప్రిల్ 17ప్రజాజ్యోతి ప్రతినిధి :**చింతకాని మండల పరిధిలో తిర్లాపురం గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం నాడు భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా చింతకానిమండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు మరియు తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు హాజరయ్యారు.ఆయన చిత్రపటానికి కొబ్బరికాయ కొట్టి,పూలమా లలు వేసి నివాళ్లు అర్పించారు. ఎంఈఓ. మాట్లాడుతూ..జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 5, 1888, ఈ రోజును 'ఉపాధ్యాయ దినోత్సవం'గా జరుపుకుంటారు.భారతదేశపు రెండవ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త మరియు విద్యావేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 17న నిర్వహించబడుతుంది. ఆయన 1975 ఏప్రిల్ 17న కన్నుమూశారు. విద్య, నైతిక విలువలకు ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయన సేవలను గుర్తు చేసుకోవాలని తెలియపరిచారు. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.సర్వేపల్లి రాధాకృష్ణన్ భారతదేశపు ప్రముఖ తత్వవేత్త, ఉపాధ్యాయుడు మరియు రాజకీయ నాయకుడు. ఆయన భారతదేశపు రెండవ రాష్ట్రపతిగా సేవలందించారు. ఆయన జీవితం పూర్తిగా విద్య మరియు తత్వశాస్త్రానికి అంకితం చేయబడింది.ఆయన విద్యార్థులకు ఒక ఆదర్శం, ఉపాధ్యాయులకు ఒక మార్గదర్శకుడు. ఆయన అభిప్రాయం ప్రకారం, విద్య అనేది కేవలం ఉద్యోగం కోసం కాకుండా, మనిషి వ్యక్తిత్వాన్ని నిర్మించే ఒక శక్తి. రాధాకృష్ణన్ గారి జీవితం సమాజంపై గొప్ప ప్రభావాన్ని చూపింది. ఆయన వల్ల విద్యకు మరింత గౌరవం పెరిగింది.ఆయన ఆలోచనలు యువతలో మంచి విలువలను పెంపొందించాయి. ఆయన ఒక రోల్ మోడల్ గా నిలిచారు అని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాసరావు, తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం స్వాతి మేడం, ఉపాధ్యాయుడు పీతం, నాలుగో వార్డ్ సభ్యుడు చాపలమడుగు మధు, అంగన్వాడీ టీచర్ సీతా నాగరత్నం, ఆశ వర్కర్ చాపలమడుగు రాణి, చాపలమడుగు సుస్మిత,అంగన్వాడి ఆయా అంజమ్మ, బండి వెంకమ్మ,గోగుల నాగేశ్వరరావు, ఐతం సీతారాములు,యువతి యువకులు, పాఠశాల పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాలలో నమోదును పెంచండి

- ప్రాథమిక పాఠశాలల బోధన సమావేశంలో
- జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైని





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**

గురువారం జిల్లా సైన్స్ మ్యూజియం ఆవరణలో ఉన్న సెమినార్ హాల్లో పాఠశాలల ఉపాధ్యాయల కు, ఆయా పాఠశాలల్లో నమోదైన బాల బాలికల కోసం యూనిఫామ్స్ ని అందజేశారు. ఈ యూనిఫామ్ తో పాటు8 అంశాలతో కూడిన వివిధ రకాల వస్తువుల కిట్ ను కూడా డీఈవో కి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ,ప్రాథమిక పాఠశాలలో నమోదయ్యే ప్రతి చిన్నారికి 8 అంశాలతో కూడిన కిట్టును అందజేస్తున్నామని తెలిపారు.ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు,ఆయాలను నియమించామని, అదేవిధంగా చిన్నారులకు అవసరమైన యూనిఫామ్, షూ, సాక్స్, బెల్ట్, పాఠ్యపుస్తకాలు,స్టేషనరీ కిట్, డ్రాయింగ్ బుక్, కలర్ క్రేయాన్స్, స్లేట్ తదితర అంశాలను అందజేసి అవసరమైన ప్లే మెటీరియల్, ఫర్నిచర్లను ప్రతి పాఠశాలలో అందుబాటులో ఉంచామని, చక్కటి బోధన అభ్యసన ప్రక్రియల ద్వారా,ఆట పాటల ద్వారా నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. పైన పేర్కొన్న అంశాలన్నింటినీ తల్లిదండ్రులకు వివరిస్తూ ప్రతి ప్రాథమిక పాఠశాలలో నమోదును పెంచాలని సూచించారు.ఈ సందర్భంగా సైన్స్ మ్యూజియంను సందర్శించిన జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైని అక్కడ ఉన్న జిల్లా సైన్స్ అధికారికి ఈ క్రింది అంశాలపై పలు సూచనలు చేశారు.జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల బాల బాలికలు ఈ సైన్స్ మ్యూజియమును సందర్శించేలా తగు ఏర్పాటు చేయాలని,తదనుగుణంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి తగిన షెడ్యూల్ను రూపొందించుకోవాలని సూచించారు. అదేవిధంగా మ్యూజియం యొక్క సెక్యూరిటీ –సేఫ్టీ కోసం తగిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అవి ఎక్కడెక్కడ పెట్టాలో కూడా తగిన పాయింట్స్ సూచించారు.అదేవిధంగా జిల్లా సైన్స్ మ్యూజియం ను సందర్శించే బాల బాలికలకు కావలసిన చల్లటి మంచినీటి వసతి సౌకర్యము ఏర్పాటు చేయడంతో పాటు మ్యూజియం అభివృద్ధికి కావలసిన పలు సూచనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంట జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి పెసర ప్రభాకర్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రచ్చ శ్రీనివాస్, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది రమేష్,28 ప్రాథమిక పాఠశాలల ఇన్స్ట్రక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న క్వార్టర్స్ కార్మికులకు ఇవ్వండి

- ఐ.ఎన్.టి.యు.సి కోటి



**సత్తుపల్లి ఏప్రిల్ 17(ప్రజా జ్యోతి )**సత్తుపల్లి ఏరియాలో ఉన్నటువంటి జె.వి.ఆర్ ఓసీ, కిష్టరం ఓసీ మరియు సి.ఎచ్.పి లో పనిచేస్తున్న కార్మికులకు పారదర్శకంగా క్వార్టర్స్ కౌన్సిలింగ్ నిర్వహించినారు. పీ.వీ.ఎన్ కాలనీలో ఎంసీ టైప్ 2,ఎండి 7 క్వాటరర్లు ఖాళీగా ఉండగా వాటికి 32 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో సీనియార్టీ వైస్ గా క్వార్టర్స్ కౌన్సిలింగ్ ఏర్పాటు చేసినారు. ఈ యొక్క కార్యక్రమంలో ఏజీఎం పర్సనల్ మోహన్ రావు ఎస్ ఓ టు జి ఎం బొల్లం శ్రీనివాస్, సివిల్ ఇంజనీర్ రవికుమార్, సీనియర్ పి ఓ కావ్య ఐఎన్ టి యూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ సూర్యప్రకాష్,ఐ ఎన్ టి యు సి ఫిట్ సెక్రెటరీ సీతారామరాజు, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ నరసింహారావు, పొట్టి కిరణ్,శ్రీధర్,సురేష్, ఉమర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ ఉపాధ్యాయురాలుకు ఘన సన్మానం



**కారేపల్లి,ఏప్రిల్ 17, ప్రజా జ్యోతి :** సింగరేణి మండల పరిధిలోని బీక్యాతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గతంలో ఉపాధ్యాయురాలుగా పని చేసి పదవి విరమణ పొందిన కర్నాటి సువర్ణను పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, గ్రామస్తులు కలిసి శుక్రవారం ఘనంగా సన్మానించారు.రైల్వే గేట్ వద్దకు చేరుకున్న ఉపాధ్యాయురాలు సువర్ణ– మాధవరావు దంపతులను పాఠశాల వరకు విద్యార్థులు పూలు చల్లుతూ ర్యాలీగా తీసుకెళ్లారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు సింగరేణి మండలంలో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న సువర్ణ– మాధవరావు దంపతులు ఎంతోమంది పేద విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారన్నారు. ఈ కార్యక్రమంలో అప్పాయిగూడెం సర్పంచ్ దండు ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి,గ్రామ పెద్దలు అజ్మీర బిచ్చ నాయక్,అజ్మీర వీరన్న, ఉపాధ్యాయ సంఘ నాయకులు,గ్రామస్తులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## చల్లగుండ్ల సేవలు అమోఘము... ఎమ్మెల్యే రాగమయి

**సత్తుపల్లి ఏప్రిల్17(ప్రజా జ్యోతి)**ఉపాధ్యాయ వృత్తిలో ఎందరకో విద్య నేర్పి,వేల మంది విద్యార్థులను తీర్చిదిద్ది,వారి జీవితాన్ని ఉపాధ్యాయునిగా అంకితం చేసి పదవీ విరమణ పొందిన చల్లగుండ్ల అప్పారావు ను సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ వారి స్వగృహానికి వెళ్లి ఆ దంపతులను అభినందించారు. పదవీ విరమణ చేసిన వారిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి,శేష జీవితాన్ని గడిపేందుకు ఆ భగవంతుడు అష్టైశ్వర్యాలు, ఆరోగ్యాన్ని ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్, వైస్ చైర్ పర్సన్ బొంతు సుమలత, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, వార్డ్ కౌన్సిలర్ గ్రాండ్ మౌలాలి, చల్లగుండ్ల నరసింహారావు, గాదె చెన్నారావు, టోపీ శ్రీను, వీరివాడ నాగభూషణం,కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



## గాదెపాడులో పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే





**కారేపల్లి,ఏప్రిల్ 17, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలో గల గాదెపాడు గ్రామంలో పలు అభివృద్ధి పనులను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్నాయక్ శుక్రవారం ప్రారంభించారు.గ్రామంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన, ఇందిరమ్మ గృహప్రవేశాలు, కళ్యాణ్ లక్ష్మి చెక్కుల పంపిణీ,సీఎంఆరఎఫ్ చెక్లను లబ్ధిదారులకు అందజేశారు.అంతకు ముందు పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన సభలో రాష్ట్రంలో నియోజకవర్గంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, ఏవో బీ.అశోక్కుమార్, ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, ఏఈలు వెంకన్న, నాగయ్య, మాజీ సోసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బానోత్ రాంమ్మూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు పగడాల మంజుల, పెద్దపోయిన ఉమా శంకర్, అడ్డగోడ ఐలయ్య, కిలారి అప్పారావు, సర్పంచ్లు భూక్య రంజిత్కుమార్, అజ్మీర ఉమానరేష్, దారావత్ మంగీలాల్, దారావత్ వెంకటేశ్వర్లు, గుగులోత్ కృష్ణ వేణి, ధారావత్ హేమలతబాలాజీ,ఈసం మోతీరస్వామి, బానోత్ పద్మావతి, మేదరి వీరప్రతాప్, బానోత్ హీరాలాల్, నూనావత్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి మండలం తహసీల్దార్ ఆఫీస్ ముందు TGEJAC నిరసన ప్రదర్శన



**కారేపల్లి, ఏప్రిల్ 17, ప్రజా జ్యోతి:**దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల, ఉపాధ్యాయుల, పెన్షనర్ల, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర టీ జి ఈ జె ఏ సి ఇచ్చిన దశలవారీ పోరాట కార్యక్రమంలో భాగంగా సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో సింగరేణి మండల తహసీల్దార్ ఆఫీసు వద్ద నిరసన ప్రదర్శన జరిగింది . అనంతరం మండల డిప్యూటీ తహసీల్దార్ కి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూరెండవ పిఆర్సి కమిషన్ రిపోర్ట్ తెప్పించి వెంటనే అమలు చేయాలి,పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి, ప్రభుత్వం పెండింగ్ బిల్లులు నెలకు ₹700 కోట్లు విడుదల చేసినప్పటికీ, రాష్ట్రంలో నెలకు సగటున 600 మంది ఉద్యోగులు రిటైర్ అవుతుండటంతో బకాయిలు భారీగా పేరుకు పోతున్నాయి. ఏకమొత్తంగా పెండింగ్ లో ఉన్న రూ.13000 కోట్లను వెంటనే విడుదలచేసి పెన్షనర్స్ కుటుంబాలు ఇబ్బందులు పడకుండా చూడాలి,అందరికీ ఆరోగ్య కార్డులను వెంటనే మంజూరు చేసి అమలు చేయాలి,కొత్త EHS స్కీం విధి విధానాలను వెంటనే రూపొందించి, మే 1వ తేది నుండి వైద్య సేవలు అందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలి, రాష్ట్రంలో కాంట్రిబ్యూషన్ పెన్షన్ (CPS)ను రద్దుచేసి పాత పెన్షన్ స్కీం (OPS) ను పునరుద్ధరణ చేయాలి. 01/09/2004 కంటే ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగులకు వెంటనే పాత పెన్షన్ స్కీం (OPS) ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో సింగరేణి మండల టీజీజేఏసీ నాయకులు మల్లెల రవీంద్రప్రసాద్, టీజీవో అసోసియేటెడ్ అధ్యక్షులు కేవీ కృష్ణా రావు, బానోత్ మంగీలాల్ ,ఎమ్. హరీష్, బి. శ్రీనివాసరావు టీపీటీఫ్ , V. మంగీలాల్, ఆ. శంకర్ ,బి. మంగ్య డి . రమేష్, బి . బాలాజీ, అజ్మీరా బన్సీలాల్, అజ్మీరా వీరు నాయక్, రాంకోట,ఎమ్ .రమేష్, రాములు , పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్ష/కార్యదర్శి నెహ్రూ,హరి, జిపిఓల మండల సంఘం అధ్యక్షులు బంపర్, రెవెన్యూ ఉద్యోగుల సంఘ బాధ్యులు పాషా, పి ఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ బాధ్యులు రమేష్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ సంఘ బాధ్యులు ప్రకాష్, ఇంజనీర్ల సంఘ బాధ్యులు నరసింహరావు, చంద్రశేఖర్, నరేందర్, హౌసింగ్ ఇంజనీర్ల సంఘ బాధ్యులు నాగేందర్, ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు, తదితరులు పాల్గొన్నారు.